క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక

దేవరకొండ: నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా నర్సింహ

మిర్యాలగూడ టౌన్: బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా రాయించు నర్సింహ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని బీసీ సంఘం కార్యాలయంలో సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను చేతులమీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఆయనతో పాటు బీసీ యువజన సంఘం మిర్యాలగూడ నియోకవర్గ ప్రధాన కార్యదర్శిగా గిరి యాదవ్, పట్టణ యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా నరేష్ నియమితులయ్యారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన

కొండమల్లేపల్లి: మండలంలోని చింతచెట్టుతండా గ్రామపంచాయతీలో ఎంపీపీ నిధులు రూ.3లక్షలతో చేపడుతున్న అంతర్గత డ్రెయినేజీ నిర్మాణ పనులను మంగళవారం ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. ఆమె వెంట మంగ్యానాయక్, గ్రామస్తులు ఉన్నారు.

భగవద్గీత శ్లోకాలపై పోటీలు

కొండమల్లేపల్లి: త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక నల్లగొండ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కొండమల్లేపల్లిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు పగిడిమర్రి వెంకటేశం భగవద్గీత శ్లోకాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మేకల శ్రీనివాసులు, చంద్రమౌళి, చక్రధర్, పరమేశ్, రంగారెడ్డి, వెంకటమ్మ, కవిత, పాఠశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు వితరణ



నీలాయిగూడెం జెడ్పీహెచ్ఎస్‌కు కుర్చీలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

త్రిపురారం: మండలంలోని నీలాయిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో 1999–2000 లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.12వేల విలువైన కుర్చీలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చే విద్యార్థులకు మొదటి బహుమతి కింద రూ.5వేలు, రెండో బహుమతిగా రూ.3వేలు, మూడో బహుమతిగా రూ. 2వేలు అంజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గుగులోతు గోపినాయక్, వెంకట్, అజ్మత్ ఖాన్, సోమయ్య, అరుణ, షేక్ పాషా, అవిరెండ్ల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

దేవరకొండ: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం చేయలేని పదవి తనకు వద్దని అంబేడ్కర్ న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన రోజును గుర్తు చేస్తుకుంటూ మంగళవారం ప్రజా సంఘాల నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంబాలపల్లి వెంకటయ్య, డా. ఏకుల రాజారావు, బుర్రి వెంకన్న, సైదులు, వెంకటాచారి, రవీందర్‌నాయక్ తదితరులున్నారు.

ఎన్టీఆర్ స్మారక నాణెం సేకరించిన యువకుడు



వంద రూపాయల నాణెంతో నవరాజ్

నాగార్జునసాగర్: టీడీపీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు స్మారకార్థం సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విడుదల చేసిన రూ.100 నాణెంను నందికొండ మున్సిపాలిటీకి చెందిన ప్రముఖ వ్యాపారి నవరాజ్ సేకరించాడు. నవరాజ్‌కు దేశ, విదేశాల నాణేలు సేకరించడం హాబీ. అతని వద్ద 190 దేశాల కరెన్సీతో పాటు బ్రిటీష్ , రాజుల కాలంలో వాడిన ఎన్నో నాణేలు ఉన్నాయి.

ఎండుతున్న పంటలు.. ఆందోళనలో రైతులు

- సరైన వర్షాలు లేక పంటలపై తీవ్ర ప్రభావం
- లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టిన అన్నదాతలు
- వరుణుడి జాడ కోసం ఎదురుచూపులు



కొంపల్లి గ్రామంలో ఎదుగుదల లేని పత్తి చేను

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తిరుమలగిరి మండలంలో ఎక్కువగా రైతులు వర్షాలను నమ్ముకొని పంటలు సాగుచేస్తుంటారు. దీంతో ప్రతి సంవత్సరం అతివృష్టి లేదా అనావృష్టి కారణంగా పంట నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ ఏడాది వర్షాకాలం సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోయే స్థితికి చేరకున్నాయి. ప్రతి సంవత్సరం రైతులు జూన్ నెలలోనే పంటలు సాగు మొదలుపెడతారు. కానీ ఈ ఏడాది జూన్‌లో వర్షాలు కురవకపోవడంతో జూలై నెల చివరిలో రైతులు పంటలు సాగు చేయాల్సి వచ్చింది. అప్పటి నుంచి కూడా సరైన వర్షాలు లేకపోవడంతో పంటలో ఎదుగుదల లోపించింది. ఈ సమయానికి పూత, కాతతో పచ్చని పైర్లతో నిగనిగలాడాల్సిన పొలాలు సరైన వర్షాలు లేక ఎండిపోతున్నాయి. ఈసారి పెట్టిన పెట్టుబడులైనా చేతికందేనా అనే విధంగా రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రస్తుతం ఇరవై రోజుల నుంచి వర్షం లేకపోవడంతో సాగుచేసిన పత్తి ఇతర పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

తగ్గిన పత్తిసాగు..

గత రెండు సంవత్సరాలుగా పత్తిలో గులాబీ పురుగు ఆశించడం, పత్తికాయ పుచ్చురావడంతో రైతులు ఈసారి పత్తి సాగుపై అంతగా ఆసక్తి చూపలేదు. దీంతో ప్రతి సంవత్సరం మండలంలో సుమారు 25వేల ఎకరాల్లో సాగయ్యే పత్తి పంట ఈ ఏడాది మాత్రం సుమారుగా 18,500 ఎకరాల్లోనే సాగు చేశారు. గతంలో బావులు, బోర్లు నీటి వసతి ఉన్న రైతులు కూడా పత్తి పంటను సాగు చేయగా వరుస నష్టాలతో నీటి ఆధారం ఉన్న రైతులు ఈ ఏడాది పత్తికి బదులుగా ప్రత్యామ్నాయంగా మిర్చి పంటను సాగు చేస్తున్నారు.

స్ప్రింక్లర్లతో తడులు..

వర్షాలు లేక బోరుబావులున్న రైతులు స్ప్రింక్లర్లతో నీటి తడులు పెడుతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు వరుణుడిపై భారమేసి ఎదురుచూస్తున్నారు. గత సంవత్సరం వరకు నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు ఉండటంతో రాజవరం మేజర్ వెంట ఉన్న రైతులు కాలువకు మోటార్లు వేసి నీటి తడులు పెట్టుకునే వారు. కానీ ఈ ఏడాది ఆ అవకాశం కూడా లేకపోవడంతో ఆ పంటలు కూడా ఎండిపోతున్నాయి. లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టి సాగుచేసిన పంట కళ్లముందే ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

సరైన వానలు లేవు



ఏడు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. నీటి వసతి లేకపోవడంతో వర్షాన్ని నమ్ముకొని వ్యవసాయం చేస్తున్నా. ఈ ఏడాది కాలం నెల, నెలన్నర రోజులు వెనక్కి పోయింది. సరైన వర్షాలు లేకపోవడంతో పత్తి పంటలో ఎదుగుదల లోపించి ఎండిపోతున్నది. ఇప్పటికే ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేలు పెట్టుబడులు పెట్టినం.

– పాల్వాయి సైదులు, రైతు, ఎల్లాపురం

నీళ్లు లేక ఇబ్బందులు



వర్షాలను నమ్ముకొని వ్యవసాయం చేస్తుంటే ప్రతి సంవత్సరం నష్టం వస్తుంది. సమయానికి అనుగుణంగా నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ పాటికి పూత, కాయ దశలో ఉండాల్సిన పత్తి పంట నేలమట్టం నుంచి పైకి ఎదగలేదు. మోటార్లతో ఎంత నీరు అందించినా పైనుంచి వర్షాలు కురిస్తేనే పంటలకు అనుకూలం.

– మేగావత్ చీనా, రైతు, గాత్‌తండా

రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ సర్కారే



కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా: రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ సర్కారే వస్తుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారని ఆయన అన్నారు. మంగళవారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తిరుమలగిరి(సాగర్) మండలంలోని మూలతండా, భోజ్యాతండాలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే భగత్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మునావత్ హరి, నేనావత్ సురేష్, నేనావత్ భంగ్య, నేనావత్ కౌశ్య, ధనావత్ ముని తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో తిరుమలగిరి మండల అధ్యక్షుడు పిడిగం నాగయ్య, జిల్లా నాయకుడు కేతావత్ భిక్షానాయక్, పాండునాయక్, బాలునాయక్, మేకపోతుల కార్తీక్, జటావత్ రమేష్‌నాయక్, గణేష్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తల ధర్నా



ఎమ్మెల్యే కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న ఆశా కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

మిర్యాలగూడ అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆశా వర్కర్లు మిర్యాలగూడ పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు రామ్మూర్తి, వీరేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని కోరారు. పెండిగ్‌లో సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దయానంద్, పాపానాయక్, శ్రీనివాస్, రామారావు తదితరులున్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ



హాలియా: హజారిగూడెంలో స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి



నిడమనూరు: రాజన్నగూడెంలో స్కూల్ బ్యాగులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

హాలియా: అనుముల మండలంలోని హజారిగూడెం , నాయుడుపాలెం, చల్మారెడ్డిగూడెం, కొట్టాల, సూరేపల్లి, హాలియాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి మంగళవారం ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుమలగిరి వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అనుముల మండల అధ్యక్షుడు వద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు చింతకాయల వెంకటేశ్వర్లు, రాంబాబు, శాగం శ్రావణ్‌కుమార్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నరేష్‌నాయక్, ఉప సర్పంచ్ జబీన్ జలీల్‌పాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంటిగొర్ల పాపయ్య, ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడు రావుల చినభిక్షం యాదవ్, తిరుమలనాథ ఆలయ చైర్మన్ బుర్రి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడులో..

గుర్రంపోడు: మండలంలోని జూనూతుల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మేకల అన్నపురెడ్డి, నాయకులు కంచర్ల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

నిడమనూరు: మండలంలోని రాజన్నగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నిడమనూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కట్టెబోయిన గురవయ్య మంగళవారం స్కూల్ బ్యాగులు అందజేశారు. పేద విద్యార్థులకు క్లబ్ తరఫున సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ అధ్యక్షుడు చేకూరి హన్మంతరావు, బాధ్యులు ముంగి మారయ్య, మజ్జిగపు వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

శారీరక ధృడత్వానికి గ్రామీణ క్రీడలే ఉత్తమం



హాలియా: ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

హాలియా: శారీరక ధృడత్వానికి గ్రామీణ క్రీడలు ఎంతో ఉత్తమమైనవని డీఎస్పీ నూకల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా మంగళవారం హాలియాలోని టైం స్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో డీఎస్పీ నూకల వేణుగోపాల్‌రెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలను డీఎస్పీ ప్రారంభించారు. అంతకు ముందు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. శారీరక శ్రమలేని ఆటలకు విలువ లేదన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని చల్మారెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్యామలాదేవిని సన్మానించారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు వెంకట్రామ్‌రెడ్డి, చెన్నుపాటి డొమినిక్, టైం స్కూల్ డైరెక్టర్ మంద నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు షర్పొద్దీన్, పీఈటీలు యడవెల్లి రాంబాబు, పరమేష్, చల్మారెడ్డిగూడెం ప్రధానోపాధ్యాయుడు దాసా వెంకన్న, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

కొండమల్లేపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కొండమల్లేపల్లిలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

మాడుగులపల్లి: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి వినయ్‌కుమార్ సూచించారు. మాడుగులపల్లి మండలంలోని తోపుచర్లలో మంగళవారం పశు వైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. నాలుగు నెలలు నిండిన పశువులకు ఈ టీకా వేయవచ్చని, గ్రామంలో 70పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగ యాదయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, జూనియర్ వెటర్నరీ అధికారి శ్రీలత, సిబ్బంది జయమ్మ, గోపాలమిత్ర తదితరులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు



వేములపల్లి: రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



నాగార్జునసాగర్: బీసీ గురుకుల విద్యాలయంలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వేములపల్లి: వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి వేడుకలను వేములపల్లి మండలంలోని రావులపెంట జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు గుడిపాటి కోటయ్య మాట్లాడుతూ.. గ్రాంధిక భాష రాజ్యమేలుతున్న రోజుల్లో వ్యవహారిక భాషాభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తి గిడుగు రామ్మూర్తి అని అన్నారు. అదేవిధంగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంగళ, ఉపాధ్యాయులు కుంచారపు శ్రీధర్‌కుమార్, పెండెం నాగలక్ష్మి, సక్కుబాయి, సీఆర్‌పీ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళి

నాగార్జునసాగర్: గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి సందర్భంగా నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని బీసీ గురుకుల గురుకుల విద్యాలయంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలి



దేవరకొండ: ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు



హాలియా: తహసీల్దార్ జయశ్రీకి వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నేతలు



మిర్యాలగూడ టౌన్: ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

దేవరకొండ: సీఎం కేసీఆర్ గత ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని టీడీపీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వస్కుల కృష్ణయ్య డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. గృహలక్ష్మీ పథకం కింద అర్హులకు ఇంటి నిర్మాణానికి రూ.6లక్షలు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గార్లపాటి శ్రీను, రవీందర్‌గౌడ్, మల్లయ్య, యాదయ్య, యాదగిరి, జహంగీర్, నర్సింహ, సంతోష్, రాజేష్ తదితరులున్నారు.

హాలియాలో..

హాలియా: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను మభ్యపెడుతుందని టీడీపీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వా అరుణ్‌కుమార్ అన్నారు. టీడీపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ప్రభుత్వ ఎన్నికల హామీలను నెరవేర్చాలని మంగళవారం స్థానిక తహసీల్దార్ జయశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులకు రూ.లక్ష రుణమాఫీ వడ్డీతో సహా చెల్లించాలని, ధరణి పోర్టల్‌లోని లోపాలను సరిచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో అనుముల మండల టీడీపీ అధ్యక్షుడు ఉద్దూరి నర్సింహారెడ్డి, నిడమనూరు మండల అధ్యక్షుడు మంద తిరుపతయ్య, తెలుగు యువత రాష్ట్ర సెక్రటరీ కంచెర్ల వెంకన్న, సీనియర్ నాయకులు కర్నె రమణారెడ్డి, హాలియా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వేముల రామస్వామి, ముజ్జా రవి తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ టౌన్: సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నందుకు నిరసనగా మంగళవారం మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా టీడీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ డీఏఓ రాధకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు, మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దళిత బంధు, బీసీ ఆర్థికసాయం అంటూ కొంతమంది బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. 9 ఏళ్ల కాలంలో కేసీఆర్ చేసిన అభివద్ధి శూన్యమని అన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నసిరుద్దీన్‌బాబా, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఉప్పలపాటి గోపాలకృష్ణ, బీసీ సెల్ కార్యదర్శి గంధం శ్రీనివాస్, నల్లగొండ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మాన్యనాయక్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చ సైదులు, మండల పార్టీ కన్వీనర్ చిలకల వెంకన్న, ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు తదితరులున్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీడీపీ నాయకులు మంగళవారం చింతపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శంషొద్దీన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యాదయ్య, నర్సింహ, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

నందమూరి హరికృష్ణకు నివాళి

మిర్యాలగూడ టౌన్: దివంగత టీడీపీ నేత, సినీ నటుడు నందమూరి హరికృష్ణ 5వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ చిలకల వెంకన్న, నసిరుద్దీన్‌బాబా, గోపాలకృష్ణ, మాన్యానాయక్ తదితరులున్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దేవరకొండ: హాలియాలో సెప్టెంబర్ 2, 3, 4 తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ 44వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. గడిచిన తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందని ఆరోపించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ముందుండి పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్, అధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్, దేవేందర్, రాములు, రవి, చరణ్, శివ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ చెన్నయ్య

మిర్యాలగూడ: మండలంలోని సుబ్బారెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య పరిశీలించారు. అనంతరం పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజన నిర్వహణను సైతం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాయని వెంకటయ్య, రమేష్ పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



క్రీడా జ్యోతి వెలిగించి ర్యాలీని ప్రారంభిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రవీందర్ తదితరులు

దేవరకొండ: క్రీడాకారులు హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని దేవరకొండ కోర్టు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి రవీందర్ అన్నారు. మంగళవారం ధ్యాన్‌చంద్ 119వ జయంతి సందర్భంగా దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పొట్ట చెన్నయ్యతో కలిసి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీటీ, సభ్యులు కలిసి ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సీఐ నాగభూషణం, అసోసియేషన్ సభ్యులు తాళ్ల శ్రీధర్‌గౌడ్, ఉమామహేశ్వర్, వైఎస్ కరుణాకర్, బత్తుల అమర్, పంతులాల్, రాజ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, శ్యాంసన్, రాజు, రమేష్, వెంకటేశ్వర్లు, విద్యార్థులు, తదితరులున్నారు.

తెలుగు భాష గొప్పతనాన్ని చాటాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ మోహన్

మిర్యాలగూడ టౌన్: తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతిఒక్కరూ చాటి చెప్పాలని మిర్యాలగూడ ట్రాఫిక్ ఎస్ఐ మోహన్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని నీరజ హైస్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉన్నత మార్గాలను ఎంచుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజు, డైరెక్టర్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ సైదయ్య, మట్టయ్య, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ శోభన్‌బాబును సన్మానిస్తున్న మాల మహానాడు నాయకులు

హాలియా: హాలియా ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శోభన్‌బాబును అనుముల మండల మాల మహానాడు నేతలు మంగళవారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు రువ్వ వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు బూరుగు వెంకటయ్య, సీనియర్ నాయకులు జంగయ్య, రెడ్డిమల్ల సురేష్, మండలి చెన్నయ్య, పట్టణ అధ్యక్షుడు మోటమర్రి సురేందర్, రువ్వ వెంకన్న తదితరులు ఉన్నారు.

టీచర్ పోస్టులు భర్తీ చేయాలి



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 22 వేల ప్రభుత్వ టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా వెంటనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో డీవైఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పఠాని శ్రీను, బాబునాయక్, పల్లా భిక్షం, పాషా, ఆశీర్వాదం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.